క్లుప్తంగా

వైభవంగా రావులమ్మ పంట జాతర

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసిన రావులమ్మ అమ్మవారి పంట జాతరను గురువారం వైభవంగా నిర్వహించారు. ఏటా మాఘ మాసంలో అమ్మవారి పంట జాతరకు తమ తొలిపంటలో వచ్చిన పంటలను నైవేద్యాలను చెల్లించుకుంటారు. జాతరకు ముందు 15 రోజుల నుంచి అమ్మవారిని గ్రామంలో పూజ ఘటాలతో ప్రతిరోజూ ఊరేగిస్తారు. పంటలు బాగా పండి సిరులు కురిపించాలని అమ్మవారికి ముడుపులు, మొక్కులు, చలివిడి పానకాలు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నేడు కొండాలమ్మ జాతర

మామిడికుదురు: పాశర్లపూడిలో కొలువుదీరిన గ్రామ దేవత కొండాలమ్మ జాతర శుక్రవారం జరుగుతుందని ఆలయ కమిటీ గురువారం తెలిపింది. జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. కళ్లు మిరుమిట్లు గొలిపే భారీ విద్యుత్ దీపాలతో అమ్మవారి ఆలయాన్ని దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. ఏడు రోజుల పాటు అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ జాతర మహోత్సవాలు 13వ తేదీ గురువారం వరకు ఏడు రోజుల పాటు జరుగుతాయని ఆలయ కమిటీ పేర్కొంది. జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

భక్తులకు సోమనాథేశ్వర వజ్రలింగం దర్శనం



మోరిలో భక్తులకు దర్శనమిచ్చిన సోమనాథేశ్వర వజ్రలింగం

సఖినేటిపల్లి: మండలంలో గురువారం రాజోలు బ్రహ్మకుమారీస్ కేంద్రం ఆధ్వర్యంలో సోమనాథేశ్వర వజ్రలింగ దర్శన దివ్య స్వర్ణిమ రథం ద్వారా ప్రచారం నిర్వహించారు. మహాశివరాత్రి పురస్కరించుకుని ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ప్రసిద్ధి గాంచిన సోమనాథేశ్వర వజ్రలింగాన్ని రథం వద్ద భక్తులు దర్శించుకున్నారు. వీవీమెరక, మోరి, మోరిపోడు తదితర గ్రామాల్లో ఈ రథయాత్ర కొనసాగింది. భక్తులు అరటిపళ్లు, కొబ్బరికాయలు నైవేద్యాలుగా సమర్పించుకున్నారు. అందరి జీవితాల్లో సుఖశాంతులు నెలకొల్పాలన్న లక్ష్యంగా స్వామివారి వజ్రలింగ దర్శనం భక్తులకు కల్పిస్తున్నట్టు రాజోలు బ్రహ్మకుమారీస్ కేంద్ర నిర్వాహకులు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

మామిడికుదురు: నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. రాజోలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 32 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు కిష్వర్ మొహిద్దీన్, క్లబ్ కార్యదర్శి కోదాటి సోమరాజు చేతుల మీదుగా పంపిణీ జరిగింది. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరాలని ఆభిలాషించారు. క్లబ్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ ఏడిద కవీంద్ర విద్యార్థులకు టైమ్ మేనేజ్మెంట్పై సూచనలు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

అంబాజీపేట: స్థానిక కోశివారి అగ్రహారంలో వేంచేసిన భువనేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 8వ తేదీ నుంచి జరగనున్నాయని భక్త బృందం తెలిపారు. 8న అంకురారోహణ, ధ్వజారోహణ, రాత్రి 9.30కి స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. 9న ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టామన్నారు.

లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ సీబీసీఐడీ డీఎస్పీ సత్యనారాయణ

రాజోలు: విద్యార్థులు తమ లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలని రిటైర్డ్ సీబీసీఐడీ డీఎస్పీ కడలి సత్యనారాయణ అన్నారు. గురువారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అధ్యక్షతన సమావేశంలో సత్యనారాయణ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన దిశగా కృషి చేయాలన్నారు. విద్యార్థులు ఆలపించిన పాటలు, సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, పీఆర్వో నల్లి రాజు, అధ్యాపకులు శైలజ, అశ్విని, డాక్టర్ బోస్, నాయకులు దార్ల పెదబాబు, జొన్నలగడ్డ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రీమియం భారం.. బీమాకు దూరం

- ముగిసిన బీమా గడువు
- తక్కువ శాతం మాత్రమే చెల్లింపు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నూరు శాతం నమోదు



మొసలపల్లిలో వరిచేనుకు పిచికారీ చేస్తున్న కూలీలు

అంబాజీపేట: భూమిలో విత్తు నాటిన నుంచి పంట చేతికొచ్చే వరకూ అన్నదాతలకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతాయి. వాటిని అధిగమిస్తూ, కష్టనష్టాలను భరిస్తూ ముందుకు సాగాలి. సాగు నీటి కష్టాలు, విత్తనాల కొరత, ఎరువులు దొరక్కపోవడం తుపానులు, ఇలా అనేక సుడిగుండాలను దాటాలి. ఆ సమయంలో వారికి ప్రభుత్వం అండ చాలా అవసరం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలిచారు. పంట సాగులో మొదటి నుంచి చివరి వరకూ తోడున్నారు. రైతుల తరఫున ప్రభుత్వమే బీమా ప్రీమియం కట్టింది. దీంతో ఆ ఐదేళ్లు రైతులకు పూర్తి భరోసా లభించింది. కానీ నేటి కూటమి ప్రభుత్వం బీమా ప్రీమియం భారాన్ని రైతులపై మోపింది. ఎకరాకు రూ.630 బీమా చెల్లించాలని ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో కేవలం ఒక శాతం మందికి మాత్రమే బీమా ధీమా లభిస్తుంది.

అన్నదాతల ఆవేదన

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని వాగ్దానం చేశారు. తీరా అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలలు అవుతున్నా, ఆ మాటే మరిచారు. అలాగే పంటల బీమా రూ.630 ప్రీమియాన్ని రైతులే కట్టుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. జగన్మోహన్రెడ్డి ప్రభుత్వంలో ఉచితంగా పంట బీమా పొందిన రైతులందరూ చంద్రబాబు తీరుతో గగ్గోలు పెడుతున్నారు. అసలే పెట్టుబడి డబ్బులు లేక ఇబ్బంది పడుతుంటే, ఇక బీమా ప్రీమియం ఎలా కట్టాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి మండలాల్లో 22,250 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఈ నాలుగు మండలాల్లో సుమారు 140 ఎకరాలకు గాను కేవలం 697 మంది రైతులు మాత్రమే బీమా ప్రీమియం చెల్లించారు. టీడీపీ పాలనలో బీమా చెల్లించడం దండగ అనే అభిప్రాయం రైతుల్లో ఉంది. గతంలోనూ టీడీపీ అధికారంలో ఉండగా రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించినా, ఏ నాడు నష్టం జరిగినా పరిహారం దక్కిన పరిస్థితులు లేవు. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితే ఉంటుందనే భావం రైతుల్లో నెలకొంది. ప్రభుత్వం ఇప్పటికే అనేకసార్లు గడువు పొడిగించినప్పటికీ వారి నుంచి స్పందన కరువైంది.

గతంలో అందరికీ..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మొదటి ఏడాది ఒక రూపాయి చెల్లించి బీమాలో పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఆ తర్వాత నుంచి రైతుల తరఫున ప్రభుత్వమే బీమా చెల్లించి ఉచిత పంటల బీమాను అమలు చేసింది. దీంతో రైతులకు కూడా ధీమా కలిగేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

పాత పద్ధతిని అమలు చేయాలి



గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన మాదిరిగా కూటమి ప్రభుత్వం కూడా ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి. సాధారణ రైతులతో పాటు, కౌలు రైతులకు కూడా పూర్తి స్థాయిలో పరిహారం అందించేవారు. ఇప్పుడు ఆ విధానం లేకపోవడంతో నష్టం కలుగుతోంది.

– దొమ్మేటి రాధాసూర్యనారాయణ, రైతు, ఇరుసుమండ

అవగాహన కల్పించాం



పంటల బీమా పథకంలో రైతులు ప్రీమియం చెల్లించుకోవాలని వీఏఏల ద్వారా రైతులకు అవగాహన కల్పించాం. రబీ సీజన్లో తక్కువ మంది ప్రీమియం చెల్లించారు. ఎక్కువ మందికి ఆన్లైన్లో వారి అకౌంట్ల ద్వారా చెల్లింపులు జరిగాయి. బీమా చెల్లించడం వల్ల ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాల నుంచి బయటపడవచ్చు.

– ఎస్జేవీ రామమోహనరావు, ఏడీఏ, పి.గన్నవరం

పోస్టర్ తొలగించారు



అంబాజీపేట ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ గోడపై కానరాని పోస్టర్

సాక్షి ఇంపాక్ట్

అంబాజీపేట: ఎన్నికల కోడ్ అమలులో అధికారులు విఫలమవుతున్న తీరుపై 'సాక్షి' దిన పత్రికలో ఈనెల 5న దాగుడు మూతల దండా'కోడ్' శీర్షికన ప్రచురితమైన ఫొటో కథనానికి అధికారులు స్పందించారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం గోడకు అంటించిన స్వర్ణాంధ్ర పేరిట సీఎం చంద్రబాబుతో ఉన్న పోస్టర్ను ఎంపీడీఓ జీవీ సరోవర్ ఆదేశాల మేరకు సిబ్బంది తొలగించారు.

జిల్లా విభాగాలకు అధ్యక్షుల నియామకం



ఆగాబాకర్ హుస్సేన్



దొమ్మేటి సత్యమోహన్



ఎంపీఎస్ నారాయణస్వామి

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా మేధావుల (ఇంటెలెక్చువల్) విభాగం అధ్యక్షుడిగా నగరం గ్రామానికి చెందిన ఆగాబాకర్ హుస్సేన్ను నియమించారు. పార్టీ అధినేత జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా ఆగాబాకర్ హుస్సేన్ గురువారం మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు.

జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడిగా సత్యమోహన్

అంబాజీపేట: కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా దొమ్మేటి సత్యమోహన్ను నియమించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి నియామక ఉత్తర్వులు వెలువడినట్లు సత్యమోహన్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సత్యమోహన్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా శిరీష్

అయినవిల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు కోనసీమ జిల్లా విద్యార్థి అనుబంధ విభాగం అధ్యక్షుడిగా మిండగుదిటి వెంకటసాయిశిరీష్ నారాయణస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు తనకు గురువారం పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. శిరీష్నారాయణస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలను మరచిందన్నారు. విద్యార్థుల తరఫున తాను పోరాడతానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన వారందరికీ అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే..

మలికిపురం: రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకాన్ని పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. యూత్ విభాగం అధ్యక్షుడిగా గుర్రం జాషువా, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కోటిపల్లి ఎస్తేరు రాణి, రైతు విభాగం అధ్యక్షుడిగా రుద్రరాజు రంగరాజు, బీసీ సెల్ అధ్యక్షుడిగా గుబ్బల సత్యనారాయణ, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా సాలా ఏసుబాబు, ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా కొల్లాబత్తుల సతీష్, మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా ఎండీవై షరీఫ్, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఇంజేటి రవి, విద్యార్థి విభాగానికి చెల్లింగి నవీన్కుమార్, పంచాయతీరాజ్ విభాగానికి ముత్యాల శ్రీనివాస్, ఆర్టీఐ విభాగానికి నల్లి శివకుమార్, వలంటీర్ విభాగానికి ఉచ్చుల వెంకట్రావు, గ్రీవెన్స్ సెల్ విభాగానికి సోమిశెట్టి మురళి, వాణిజ్య విభాగానికి తిరుమాని రాజు, చేనేత విభాగానికి ఇనుమర్తి వీర నాగరాజు, వైఎస్సార్ టీయూసీ విభాగానికి పితాని నరేష్, అంగన్వాడీ విభాగానికి మల్లిక సీతామహాలక్ష్మి, లీగల్ విభాగానికి దివ్వి నారాయణమూర్తి, కల్చరల్ విభాగానికి కడలి కృష్ణరావు, సోషల్ మీడియా విభాగానికి జిల్లెళ్ల ఉదయ్కిరణ్, ఐటీ విభాగానికి రొక్కాల సందీప్, దివ్యాంగుల విభాగానికి పితాని ఏసుబాబు, డాక్టర్స్ విభాగానికి రామేశ్వరపు పోతన, ఇంటలెక్చువల్ ఫోరం విభాగానికి ఇందుర్తి వెంకటేశ్వరరావు, బూత్ కమిటీల విభాగానికి నామన మణికంఠ, పబ్లిసిటీ విభాగానికి నక్కా రామారావులను అధ్యక్షులుగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ సందర్భంగా గురువారం మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు నూతన కమిటీలను అభినందిస్తూ పార్టీని అన్ని విధాలుగా బలోపేతం చేయాలని సూచించారు.

సర్పంచ్ను కాపాడిన బెల్లంపూడి గ్రామస్తులు



బెల్లంపూడి వద్ద కాలువలో పడిపోయిన మోటారు సైకిలు

పి.గన్నవరం: మోటార్ సైకిలుపై వస్తూ బెల్లంపూడి వద్ద గురువారం అర్ధరాత్రి ప్రమాదానికి గురై పంట కాలువలో పడిపోయిన ఎల్.గన్నవరం సర్పంచ్ పసలపూడి రామకృష్ణను స్థానికులు రక్షించారు. తీవ్రగాయాల పాలైన రామకృష్ణను తొలుత పి.గన్నవరం సీహెచ్సీకి, అక్కడి నుంచి రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. సర్పంచ్ రామకృష్ణ గురువారం అర్ధరాత్రి తాడేపల్లి గూడెం నుంచి ఎల్.గన్నవరంలోని ఇంటికి మోటారు సైకిలుపై బయల్దేరారు. బెల్లంపూడి ఎండీపేటకు వచ్చే సరికి ఆయనకు ఫిట్స్ వచ్చాయి. దీంతో మోటారు సైకిలు అదుపుతప్పి రోడ్డుకు ఎడమవైపున్న ఉన్న పంట కాలువలో పడిపోయింది. దీనిని గమనించిన దిగుమర్తి శ్రీను, నాగరాజు, నెల బాలుడు, ఆకుమర్తి రాములు వెంటనే కాలువలోకి దిగి తీవ్ర గాయాలపాలైన రామకృష్ణ బయటకు తీసుకువచ్చారు. ఫిట్స్ నుంచి కోలుకునేటట్టు చేసి, ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా పి.గన్నవరం సీహెచ్సీకి తరలించారు. నీట మునిగిపోతున్న సర్పంచ్ను కాపాడిన గ్రామస్తులను పలువురు అభినందించారు.

క్యూ పాటించి దర్శనం చేసుకోవాలి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కె.మాధవి

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో తీర్థమహోత్సవాల్లో భక్తులు క్యూ పాటించి, దైవదర్శనం చేసుకోవాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి సూచించారు. గురువారం అంతర్వేది టూరిజం గెస్ట్ హౌస్లో ఆర్డీవో మీడియా సమావేశం నిర్వహించారు. దర్శనం సమయంలో పిల్లలను తగు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. గుడిని పరిశుభ్రంగా చూసుకోవాలని అన్నారు. తీర్థంలో శానిటేషన్ మూడు షిఫ్టులలో కార్మికులు నిర్వహించనున్నారని తెలిపారు. భక్తుల భద్రతకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు భాగస్వాములవుతున్నట్టు ఆర్డీవో వెల్లడించారు. ఎండోమెంట్ డీసీ డీఎల్వీ రమేష్బాబు, ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

గండి పూడ్చివేత

ఆలమూరు: మండలంలోని జొన్నాడ నంబర్-1 కాలువలో గురువారం గండి పూడ్చివేశారు. పంట కాలువలోని నీరు మురుగుకాలువలోకి వెళుతుందనే రైతుల ఫిర్యాదుతో చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు స్పందించి రైతుల సహకారంతో గండిని పూడ్చివేశారు. అలాగే ఉపాధి కూలీలతో కాలువ వెంబడి చెత్త తొలగించి సాగునీరును సక్రమంగా పారే విధంగా తీర్చిదిద్దారు. తూర్పు డెల్టా ప్రధానకాలువ వెంబడి వెళుతున్న పంటకాలువలన్నీ ఆధునీకరిస్తే శివారు ప్రాంతాలకు సైతం సాగునీరు అందించే వీలుంటుందనే భావనతో దశల వారీగా కాలువలను పరిశుభ్రం చేస్తున్నామని గారపాటి అన్నారు.

నాయీబ్రాహ్మణ సమాఖ్య ఏకగ్రీవం

ఆలమూరు: మండలం నాయీబ్రాహ్మణ సంఘ సమాఖ్య ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండలంలోని మడికి శివారు చిలకలపాడులోని సాయిబాబా మందిరం వద్ద గురువారం మండల కన్వీనర్ పావులూరి దుర్గారావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీవీఎస్ గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి వెన్నెటి సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సభ్యులందరూ మండల ధన్వంతరి నాయీబ్రాహ్మణ సంఘ సమాఖ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధన్వంతరి నాయీబ్రాహ్మణ సమాఖ్య గౌరవ అధ్యక్షులుగా దుగ్గదుర్తి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడిగా చోడవరపు రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా పావులూరి దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా జొన్నాడ నాగ వెంకట రాంబాబు, కోశాధికారిగా తణుకు వీవీ సత్యనారాయణతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఓవర్ లోడింగ్ వాహనాలపై చర్యలు



ఆర్టీసీ అధికారులతో సమావేశమైన ఆర్టీఓ శ్రీనివాసరావు

రాజోలు: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణం పురస్కరించుకుని ఈనెల 7, 8 తేదీల్లో అంతర్వేది వచ్చే ప్రయాణికుల వాహనాల ఓవర్ లోడింగ్పై చర్యలు తీసుకుంటామని జిల్లా ఆర్టీవో దేవిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆయన రాజోలు ఆర్టీసీ డిపో మేనేజర్ ధనమ్మ, ఇతర అధికారులతో గురువారం సమావేశమయ్యారు. ఆటోలు, మ్యాక్సీ క్యాబ్ తదితర వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఉంటే వారిని అక్కడిక్కడే దించి ఆర్టీసీ బస్సుల ద్వారా అంతర్వేది తరలిస్తామన్నారు. ఓవర్ లోడింగ్కు పాల్పడిన వాహన యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామన్నారు.

సామూహిక నిర్మూలనతో పంటల రక్షణ



కొత్తపేటలో రైతులకు ఎలుకల మందు పంపిణీ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

కొత్తపేట: పంటలను తీవ్రంగా నష్టపరిచే ఎలుకలను సామూహికంగా నిర్మూలించడం ద్వారా పంటలను రక్షించుకోవాలని వ్యవసాయ సిబ్బంది రైతులకు వివరించారు. గురువారం కొత్తపేట, ఆత్రేయపురం మండలాల్లోని అన్ని గ్రామాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించారు. ఉచితంగా నూకలతో తయారు చేసిన మందును పంపిణీ చేశారు. తయారు చేసుకున్న ఎరను ఎలుకలు సంచరించే బొరియల వద్ద ఉంచితే విషపుఎరను ఎలుకలు తిని చనిపోతాయన్నారు. ఆ మేరకు వారు స్వయంగా రైతులచే మందు పొట్లాలను బొరియలు వద్ద పెట్టించారు.

శ్రమ శక్తి సంఘాలను ఏర్పాటు చేయండి



ఆలమూరులో ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ప్రసంగిస్తున్న ఏపీఓ

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రమ శక్తి సంఘాలను ఏర్పాటు చేయాలని ఏపీడీ కంఠంశెట్టి సత్యనారాయణ కోరారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల ఫీల్డ్ అసిస్టెంట్లతో గురువారం సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీఓ అరుణకుమారి అధ్యక్షత వహించగా ఏపీడీ సత్యనారాయణ పాల్గొని ప్రసంగించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 25 నుంచి 50 మంది కూలీలకు ఒక్కొక్కటి చొప్పున శ్రమ శక్తి సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. మండలంలోని 18 గ్రామాల్లో 70 శ్రమ శక్తి సంఘాలు లక్ష్యం కాగా ప్రస్తుతం 38 సంఘాలు మాత్రమే ఏర్పాటు జరిగిందన్నారు. ఈనెలాఖరునాటికి శ్రమ శక్తి సంఘాల లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఎన్ఆర్జీఈఎస్ అధికారులు పీవీవీఎస్ ప్రసాద్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేని చదువులతో ఉత్తమ ఫలితాలు



సుమిత్ రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ ఏవీఎస్ రాజు

రాజోలు: ఒత్తిడి లేని చదువులతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని మాజీ డిప్యూటీ స్పీకర్ ఏవీ సూర్యనారాయణరాజు అన్నారు. గురువారం న్యాయవాది యాలంగి రమేష్ తనయుడు యాలంగి సుమిత్రామారావు పదో వర్ధంతి నిర్వహించారు. రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సుమిత్ రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రైవేటు కళాశాల ఒత్తిళ్లకు సుమిత్రామారావు ప్రాణాలు కోల్పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు అంతా ఒత్తిడికి దూరంగా ఉండాలన్నారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ జె.శాంతకుమరి, రిటైర్డ్ ఎంఈఓలు బోళ్ల భద్రం, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, రిటైర్డ్ టీచర్ ఇంజేటి సువర్ణరాజు, దార్ల పెదబాబు, అధ్యాపకులు జిల్లెళ్ల రాజబాబు, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదంలో గాయపడిన బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు గురువారం రూ.పది వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన చిట్టూరి కనకారావు(54) 15 రోజుల క్రితం ఇంటి దగ్గర ప్రమాదవశాత్తూ పడిపోవడంతో తలలో రక్తం గడ్డకట్టి రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించారు. ఇప్పటివరకూ రూ.2 లక్షల వరకూ అప్పు చేసి ఖర్చు పెట్టారు. ఇంకా వైద్యానికి ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. జట్టు కూలీగా పని చేసే అతడికి అంత స్తోమత లేకపోవడంతో కుటుంబ సభ్యులు కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరారు. దీంతో కనకరావు ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.10 వేల చెక్కు అందజేశారు.

బందోబస్తుపై ఎస్పీ సూచనలు



అంతర్వేదిలో నిర్వహించిన పోలీసు బందోబస్తు సమావేశం

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో గురువారం తీర్థంలో నిర్వహించాల్సిన బందోబస్తుపై వివిధ కేటగిరిలోని పోలీసు సిబ్బందికి కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు పలు సూచనలు చేశారు. తీర్థం ఏరియాను ఆరు సెక్టార్లుగా విభజించి, ఆయా సెక్టార్లు వారీగా సిబ్బంది విధులపై పలు ఆదేశాలు ఆయన జారీ చేశారు. అమలాపురం, కొత్తపేట డీఎస్పీలు ప్రసాద్, మురళీమోహన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశం



వీవీమెరకలో సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సఖినేటిపల్లి: మండలంలోని వీవీ మెరక గ్రామంలో గురువారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా సన్నాహక సమావేశం నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎన్డీఏ కూటమి శ్రేణులు అందరూ కలసి కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. ఏపీ మార్క్ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, ముప్పర్తి నాని, గెద్దం మహాలక్ష్మిప్రసాద్ పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో తనిఖీ



విద్యార్థినిని అభినందిస్తున్న అధికారి

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలను విద్యాశాఖ జిల్లా మానిటరింగ్ అధికారి సుబ్రహ్మణ్యం గురువారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. వారి సామర్థ్యంపై ఉపాధ్యాయులను ఆరా తీశారు. మేథ్స్లో ప్రతిభ చాటిన విద్యార్థినిని అభినందించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూశారు. స్కూల్ రికార్డులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్లో జరిమానాలు

అమలాపురం టౌన్: పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్లో ఐదుగురు పట్టుబడ్డారు. పట్టుబడ్డ నిందితులను స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో గురువారం హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ ఒక్కొక్కరికీ రూ.11 వేల చొప్పున మొత్తం రూ.55 వేలు జరిమానా విధించారు. అలాగే ర్యాష్ డ్రైవింగ్ చేసిన ఓ నిందితుడిని కూడా కోర్టులో హాజరు పరచగా అతడికీ రూ.వెయ్యి జరిమానా విధించారని సీఐ వీరబాబు తెలిపారు.